ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)

# సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 78-83

# అడవిపక్షి ఆలాపన ఆదివాసి ఆవేదన – పరిశీలన

**డా. పొనుగోటి రవికుమార్**

తెలుగు శాఖ అధ్యక్షులు

ఎస్ఆర్ & బిజియన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ & పీజీ కళాశాల (A), ఖమ్మం.

Ph 9290403605

**ఉపోద్ఘాతం:** అడవి పక్షి ఆలాపన కవితా సంపుటికి అక్టోబర్ 2016లో ఆదివాసి ఆవేదన పేరుతో ముందుమాట రాశాను. ఈ కవితా సంపుటిలో 54 కవితలతో వెంకట్ లాల్ గారు ప్రచురించారు. ఇందులో కవితలన్నీ ఎంతో హృద్యంగా మనసును ఆకట్టుకుంటాయి. కవి సమాజంతో అమాయకంగా సంభాషిస్తారు. ఆవేదనతో ప్రశ్నల వర్షం కురిపిస్తారు. ఒక్కొక్క కవితా ఒక్కొక్క సమాజ వాస్తవిక చిత్రణకు మచ్చుతునకలు. ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం వారు అడవిపక్షి ఆలాపనను M.A విద్యార్థులకు పాఠ్యపుస్తకంగా స్వీకరించారు. అందుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం వారికి ప్రత్యేక ధన్యవాదాలు. డాక్టర్ వెంకట్ లాల్ గారికి అభినందనలు.

సామాజిక సం వేదనలను వ్యక్తీకరించి కవిత్వం రాయడం ఆధునిక కవిత్వంలో చెప్పుకోదగ్గ పరిణామం. కొత్తగా రచనలు చేసేవారు కవితా ప్రక్రియనే ఎన్నుకొని తమ రచనా ప్రయాణాన్ని మొదలుపెడతారు. తెలుగు కవిత్వానికి వెంకట లాల్ కొత్త గొంతుక. ఆదివాసీల్లో గూడు కట్టుకున్న ఆవేదనను, ఆక్రందనను ఆర్తిగా అచ్చమైన అడవి పక్షిలా వెంకట్ లాల్ ఆలపించారు.

**కవి హృదయ స్పందన:** ఇందులోని కవితలు కేవలం కవి ఎంచుకున్న ఘటనల నేపథ్యం నుండి మాత్రమే చూస్తే సరిపోదు. కవి మానసికావస్థలోని సంఘర్షణ పూరితమైన సమాజ బతుకుల్లో నుంచి చూస్తే స్పష్టంగా వినబడతాడు, కనబడతాడు. కవి హృదయాన్ని దగ్గరగా చూసిన వ్యక్తిగా నేను ఆయన కవితను దాదాపుగా అంచనా వేయగలనని అనుకుంటున్నాను.

అడవి నుండి బయటకొచ్చినా ఆధునికత అల్లికైన 'బతక నేర్చినతనం' అతనికి ఏ కించెత్తు కూడా లేదు. ఆధునిక సమాజంలో బతక నేర్చినతనం లేకపోతే బతకడం కష్టమే. ఆ బతకలేని తనమే తన మూలాలను వెతుక్కుంది. ఆ వెతుకులాటే వెంకట్ లాల్ ను కవిగా మన ముందు నిలబడటానికి నిలువెత్తు కారణమైంది. ప్రశ్నించే తత్వాన్ని, ధికారాన్ని కవితా వస్తువులుగా చేసుకొని మన ముందుకొస్తున్నాడు.

**కావ్య విశ్లేషణ;** మనిషి మార్కెట్ మాయాజాలంలో చిక్కుకుపోవటం ప్రపంచీకరణలో అనివార్యమైన పరిణామం. కానీ కవి అలా చిక్కుకు పోవడాన్ని ప్రశ్నిస్తాడు. మనుషులుగా మారమంటాడు. నాగరికత మా మూలవాసులదని ఆత్మగౌరవాన్ని అంబరమంత సంబరంగా ప్రకటిస్తాడు. ఒకరి ప్రయోజనాల కోసం మరొకరిని బలి చేయడం నాగరికత కాదంటాడు.

"ఒక జాతిని పణంగా పెట్టి! ఇంకో జాతి ప్రాణాల్ని నిలబెట్టే నాగరికత మీకే చెల్లింది! ఇన్నాళ్లు సంది మీది నాగరికతనుకున్నం. ఇప్పుడు మాదే నయమనిపిస్తుంది". మనిషిని మనిషిగా గుర్తించమంటాడు. అసలైన మానవతా వాదివి కావాలంటాడు. మానవత్వంతో

ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 78-83

మౌనగీతం ఆలపించమంటాడు. ఆదివాసులు అనాగరికులనే మౌనగీతం ఆలకించమంటాడు. ఆదివాసులు అనాగరికులనే సాంప్రదాయ భావజాలాన్ని తిరస్కరిస్తాడు. ధ్వంసమౌతున్నవి అడవులూ కావు నగరాలని వెలుగెత్తి నినదిస్తాడు. 'నగరం నడక' కవితలో ప్రకృతిని మనిషి కబలించి పచ్చికను మింగి ఎలా కాలుష్య కాసారంగా మారుస్తున్నాడో తెలియజేస్తూ

"ఆ నడకలో అడుగుల్లో
దాహమేస్తే
శివార్ చెరువుని హరించి
అలసటొస్తే అలసట వస్తే పసిరిక జాడల్ని మింగేసింది"

అని మనిషిని యంత్రంగా మార్చివేసిన నాగరీకరణ జాడ్యాల్ని గాయాలను ఒడుపుగా పట్టుకుంటాడు.

ఆదివాసీలు స్వేచ్ఛగా సెలయేటి నురగల్లా గాలి తరగల్లా బతకాలంటాడు. అందుకు కాలుష్యం లేని అడవిని కోరుకుంటున్నాడు. అలాగని దూరంగా పారిపోవడానికి కాదు. ఆధునిక సమాజంలో లేని స్వేచ్ఛా, సమానత్వం, సోదరభావం అడవి సొంతమని అందుకే జనారణ్యం వదిలి వనారణ్యాన్ని కోరుకుంటాడు. బతకాలంటే ఘర్షణ తప్పదనే స్పృహ కవిత్వం నిండా పరుచుకొని మనకి కనబడుతుంది.

ఆదివాసీల పట్ల, రాజకీయ నాయకుల చేతకానితనాన్ని ప్రశ్నిస్తాడు. వారి దోపిడీ విధానాన్ని కవిత్వమంతా విస్తరించి మనకు స్పష్టమైన గొంతుకతో చెబుతాడు. తెలుగు రాష్ట్రాల్లో ఆవిష్కృతమవుతున్న రాజకీయ పరిస్థితులను ప్రతిబింబిస్తూ రాజకీయ నాయకుల ఊసరవెల్లిలా రంగులు మార్చేతనాన్ని 'ఎవరు నువ్వు' కవితలో ఆవిష్కరిస్తాడు.

"అభిమానాన్ని అంగట్లో తోలి అవినీతి మూలధనానికి జాతికి తాకట్టుపెట్టి పదవుల పై ప్రేలాపన చేస్తున్న నీలాంటి వాళ్లు కాదు ఈ దేశానికి కావాల్సింది" అని నైతికతలేని రాజకీయ నాయకుల నీతి బాహ్య చర్యలను తీవ్రంగా నిరసిస్తాడు.

చదువుతో సమాజాన్ని ఎలా మార్చవచ్చో తెలియజేశాడు. మారనని మొరాయిస్తున్న సమాజాన్ని కవిత్వమనే అక్షరాలతో ఎలా మార్చుకోవచ్చో 'కొలిమి' కవితలో "అక్షరాలకు ఆవేశం ఒక పోసి కవిత్వాన్ని అజ్యంగా చేసి రగిలిస్తున్న నిత్య సంచలన కొలిమినని" ప్రకటించారు.

అంతేగాక
"పేదవాని
కాదెరువుగా ఆయుధాలై మొలుస్తున్న అక్షరాలు
సాదా మనుషుల బాధలని
ధరణీ పతుల దౌర్జన్యాలని
కాల్చి బూడిద చేయగా
కొలిమిలో రగిలే ఈ అక్షరాలే
కలం బాట పట్టి కవితలై సాగిపోతుంది" అన్నారు.

ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 78-83

కుల సమాజంలో నిమ్నకులాల వారికి అభివృద్ధి అందని ద్రాక్షగా మారిందని మతం మనుషుల మధ్య నిట్ట నిలువునా మిద్దెలు కట్టిందని అవి కూలిపోతాయని 'ఆశ' కవితలో

"కులం పుట్టిన కపాలాన్ని
కనిపెట్టి పగలగొట్టే రోజోస్తోంది"

అని ఆశావాదాన్ని వ్యక్తీకరించాడు. అలాగే 'కులగీత'లో

"మనిషి మనిషిని వేరు చేసే కులం ఎవడు గీసిన గీత" అని మత గ్రంథాలపై నిరసన గళాన్ని శక్తివంతంగా వినిపిస్తాడు. కులం విషనాగని స్పష్టంగా గుర్తిస్తాడు. దాని నిర్మూలన తప్పక జరగాలని అభిలాషిస్తాడు.

'ఘర్ వాపసి' కవితలో కుల సమాజం మానవత్వం మరిచి నిమ్న కులాలను 'పొమ్మన లేక పొగ పెట్టినట్లు' తరిమి తిరిగి ఇంటికి రావాలి రమ్మనమని పిలుస్తున్న వారి అసలైన నైజాన్ని బట్టబయలు చేసింది. 'చీమలు పెట్టిన పుట్టలో పాములు దూరినట్లు' విదేశీ మూకలు మూలవాసులను ఊరికి దూరంగా వాడల్లోకి, వాడల నుండి అడవుల్లోకి తరలిన వేసిన వైనాన్ని ధ్వనింపజేస్తూ.. వేద కాలం నుండి ఆధునిక కాలం వరకు కొనసాగుతున్న యువకుల వివక్షతల 'ఘర్ వాపసి'ని వ్యంగ్య గొంతుకతో నిరసిస్తాడు.

"వొంగి వొంగి ఆత్మాభిమానాన్ని హత్య చేసుకునే చోటుకి
..సనాతన ధర్మం పడగనీడలో నైతికతను వంచిస్తున్న చోటుకి
..పురాణాలే రాజ్యాంగాలై
ఏలే చోటుకి.." పిలుస్తున్న వారి నెగెటివ్ టోన్ నిజ స్వరూపాన్ని ఆవిష్కరిస్తూ,

"పంచముడనని కించపరిచి ఊరవుతల వెలివేతకు గురవుతున్న ముదనష్టపు బతుకుల్ని పునర్ నిర్మించేందుకు..." రండని పాజిటివ్ టోన్ తో మూలవాసులుని ఆహ్వానిస్తాడు. ఈ దేశం ఆదివాసులది, మూలవాసులదేనని స్పష్టంగా ప్రకటిస్తాడు.

"మాకో అడవి నియ్యండి" కవితలో రాజ్యాధికారాన్ని స్పష్టమైన గొంతుకతో ప్రశ్నిస్తాడు. పొలాలకు నీళ్లు కావాలనే నెపంతో ఆదివాసీలను అడవి నుండి మీ అధికార బలుపుతో బయటకు తీసుకు రాగలరు. కానీ

"మరి మా ఈ పక్షులు గూళ్ళు పసువుల ఆవాసాల మాటేమిటి?"

అని మూగజీవుల పక్షాన గొంతెత్తి వాటి ప్రాణాల సంగతేమిటని ప్రశ్నిస్తాడు.

మీరిచ్చే నీళ్లతో మా దాహం తీర్చలేరు. కనుక

"గోదారిని కూడా కొంచెం కోసీయ్యండి...
మా తరాలకు సరిపోను దాచుకుంటాం" అని వ్యంగ్యంగా అడుగుతాడు. పోలవరం నిర్మిస్తూ ఆదివాసీలకు రాజ్యం నష్టపరిహారాలు ప్రకటించింది. ఆ నష్టపరిహారాన్ని నగదు రూపంలో గాక

ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 78-83

ఏది ఇచ్చినా అచ్చమైన, స్వచ్ఛమైన ఇంకో అడవినే ఇయ్యండని" గిరిజన మనోగతాన్ని స్పష్టంగా విశదీకరిస్తాడు. అంతేగాక 'బంధించండి' కవితలో మమ్మల్ని అడవుల నుండి బయటకు తీసుకురావడమంటే బంధించడమేనని

"చేపల్ని పట్టి ఏదో అక్వేరియంలో పెట్టినట్లు
పచ్చుల్ని బట్టి పంజరంలో బంధించినట్లు!!
మీ పార్కులల్ల ఇంకో అడవి రూపాన్ని ప్రతిష్ఠించినట్లు మమ్మల్ని కూడా మరో అడువిల్నే బంధించండి" అని సహజమైన వాతావరణంతో బతుకుతున్న గిరిజనులను తరపున అడవి నుండి బయటకు తీసుకువస్తే వారు అసహజమైన జీవనాన్ని గడుపుతారని తెలియజేశారు.

ఆధునిక జీవితం పేరుతో ఆదివాసీల జీవితాలతో ఎలా చెలగాటం ఆడుతున్నారో "అడవి పక్షి ఆలాపన" కవితలో పేర్కొంటూ కవిత్వాన్ని గోదారిలా ఎల్లువెత్తించాడు. పోలవరం ప్రాజెక్టుతో ఆదివాసీల దుఃఖం 'అలుగుపడ్డ కన్నీటి ధారల బాధల నదిలా ఉంద'న్నాడు.

ఆ దుఃఖంతో వచ్చే కన్నీళ్ళు కొత్త గోదారిధారలా ఉందన్నాడు. మూలవాసుల హక్కులు దిక్కులేని సమాధులవుతుంటే ఈ ఘోరాన్ని రెక్కల్లో దాపెట్టి ఎవరెవరుకో చెప్పాలని ఎగరాలనుకున్నా కానీ అధికార స్వార్థానికి ఆదివాసీల….
"రెక్కల ఆరాటం నా అడవి బతుకు ఆకాంక్ష
నా జాతి కలల ఊహలు" చెల్లాచెదుర అయ్యాయని నా గోడు ఎవరికి పట్టడం లేదని ఆదివాసీల దుఃఖాన్ని వెల్లడిస్తాడు.

ప్రజాస్వామ్యం కనిపించని శక్తుల అపహరణకు గురవటమే అసలు కారణమని స్పష్టంగా గుర్తిస్తాడు. అందుకే నా మూలాలను కోల్పోవడానికి సిద్ధంగా లేనని మూలవాసుల పోరుబాటున నడిచి రాజ్యాధికారాన్ని సాధించుకోవాలని పోలవరం బాధితుల తరపున రణనినాదాన్ని ప్రకటిస్తాడు.

కుల మత పితృస్వామ్య భావజాలం స్త్రీని ఇంటికే పరిమితం చేశాయని అందుకు కారణం పురుషదిత్యానికేలోకం మొగ్గు చూపుతుందని కవి గుర్తిస్తాడు. సాంప్రదాయక భావజాలం నుండి బయటపడాలని స్త్రీలు చైతన్యవంతులు కావాలని 'చీకటి విత్తులు' కవితలో స్త్రీల ప్రాధాన్యతను తెలియజేస్తాడు.

"సూర్యరశ్మి కాదని చీకటి విత్తులు చిగురించలేవు నిన్ను వదిలి సృష్టి ఎదుగుదల సాగించలేదు" అని స్త్రీలను సూర్యరశ్మితో పోలుస్తూ సృష్టి రహస్యాన్ని విడమరచి చెబుతాడు. అంతేగాక స్త్రీలు సాంప్రదాయ భావజాలం నుండి బయటపడాలని 'బలిపీఠం' కవితలో ఆకాంక్షిస్తాడు. మనువాదం స్త్రీని అబలను చేసి స్త్రీని స్వతంత్రానికి అర్హురాలు కాదంది. స్త్రీ పుట్టినా బతికినా చచ్చినా మగ నీడలోనేనని మనుస్మృతి చట్టం చేసింది. ఆదిమ కాలము నుండి ఆధునిక కాలం వరకు స్త్రీల దినావస్థకు మనువు మూల కారణమంటాడు.

ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 78-83

"ఏ అభయము లేని నిర్భయల్లా ఛాందసవాద శవాల కంపులో కుళ్లిపోతున్న తులసి కోటలు" అని సాంప్రదాయ భావజాల బ్రాహ్మణీయ భావజాలం నుండి బయటకు రావాలని కవి ప్రతీకాత్మకంగా తెలియజేశారు.

'చేనేత దినం' కవితలో తెలంగాణ 'సిరిసిల్ల'లో చేనేత కార్మికుల ఆత్మహత్యలకు మగ్గాలు సర్పాలై ఎలా కాట్లు వేస్తున్నాయో చెబుతూ...
"మగ్గాలు నేసిన పగ్గాలే
బలిదానాల సర్పాలై వేలాడుతుంటే సిరుల సిరిసిల్ల ఇరుగుబద్ధ మగ్గమైపోయింది"వారు నేసిన గుడ్డ 'కన్నీళ్లు తుడిచేందుకు వెనకాడుతుంది' అని ప్రపంచీకరణ ప్రభావంతో చేనేత మార్కెట్ పరాయికరణకు గురై
"బ్రాండ్ల మోజులో చేనేత అస్తిత్వం పగిలిన గాజు పెంకుల"
మారి కుదేలైందని దేశీయ మార్కెట్ ను అంచనా వేస్తాడు.

కవిత్వం గత, సమకాలీన సమాజాన్ని విమర్శనాత్మకంగా ఎత్తిచూపాలి. పీడితుల పక్షపాతిగా గొంతెత్తి నినదించి సమాజంలో చైతన్యాన్ని నింపాలి. భవిష్యత్తుకు వారధిలా దారి చూపిస్తూ కవిత్వం కాగడాలాగా వెలుగు ప్రసరించాలని 'కరదీపిక' కవితలో
" కవిత్వమొక
సమ గీతికయై
మనిషి మనిషికి మధ్య పరచుకున్న అగాధాలను పూడ్చి
సమానత్వ వేదికలని నిర్మించాలి" అని సమానత్వానికి పెద్దపీట వేశాడు. ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషను రక్షించుకోవాలంటాడు.

"అన్య భాషలు మాతృభాషను హత్య చేసినప్పుడు నెత్తుడి ముద్దల చుట్టూ చీమల్లా
నీ అక్షరాలు పాత భాషల వాసనల్ని శోధిస్తుంటాయి"
అని మాతృభాష పక్షాన గళం ఎత్తారు.

**కావ్య విశిష్టత:** మొత్తం మీద అడవిపక్షి ఆలాపన చూస్తే ఆదిపత్య, దోపిడీకులాల రాజకీయాలకు ఆదివాసీలు బలి అవుతున్నారని మా బతుకులు మమ్మల్ని బతకనీయండని అంటాడు. అణచివేతకు గురవుతున్న అందరి పక్షాన కవిత్వం నిలబడాలని కోరుకుంటాడు. పీడిత ప్రజల పక్షమై అక్షరాలు గోదారిలా వెల్లువెత్తలని అంటాడు. దళిత, గిరిజన,స్త్రీల పక్షాన నిలబడాలంటాడు.
**కావ్య శిల్పం:** శిల్పం విషయానికొస్తే కవి తాను ఎంచుకున్న వస్తువు ద్వారా సూటిగా విషయాన్ని చెప్పడానికి ఆసక్తి చూపాడు. కవి తన నిరసనను వ్యక్తీకరించడానికి వ్యంగ్యాత్మకంగా, చమత్కారంగా నినాదాలు పరంపరలతో ఉపమా, రూపకాలతో భావాలను అభివ్యక్తీకరించారు. దాదాపు కవితలన్నీ తాను ఉద్దేశించిన పాఠకులకు చేరువయ్యే శైలిలో

ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 78-83

వెలువరించాడు. కనుక ఈ అడవి పక్షి ఆలాపన తప్పకుండా పాఠకులకు చేరువుతుందని ఆశిస్తున్నాను.

**ఆధార గ్రంథాలు:**


1. వెంకట్ లాల్. జి: 2016 అడవి పక్షి ఆలాపన, దీప్తి పబ్లికేషన్స్, తెనాలి.
2. ఇనాక్, కొలకలూరి: 2010, ఆధునిక విమర్శ సాహిత్య సూత్రం, జ్యోతి గ్రంథమాల ప్రచురణ, హైదరాబాద్.
3. లలిత, వకులాళాభరణం: 2009, ఆంధ్ర ప్రదేశ్ లో విముక్త జాతులు, నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా.
4. హస్ నైన్ నదీం: 1996, భారతీయ గిరిజనులు, ఓరియంటల్ లాంజ్మన్, హైదరాబాద్.